పరిహారం కోసం ఎదురుచూపులు

- ప్రారంభమైన మొక్కజొన్న కోతలు
- అకాల వర్షాలకు మండలంలో 810 ఎకరాల్లో నష్టం
- జమకాని పంటనష్టం డబ్బులు
- కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతన్న డిమాండ్



జూలపల్లిలో మొక్కజొన్న పొట్టు తీస్తున్న మహిళలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మొక్కజొన్న కోతలు జోరందుకున్నాయి. గత ఐదేళ్లలో పెరిగిన మక్కసాగుతో రైతులు తమ కష్టాలు తీరుతాయని ఆశపడ్డారు. కానీ అకాల వర్షాలతో మొక్కజొన్న నేలవాలడంతో అన్నదాత నిరాశకు గురయ్యాడు. ప్రభుత్వం అండగా ఉంటుందన్న హామీ మేరకు వ్యవసాయాధికారులు పంట నష్టం వివరాలు సేకరించారు. పరిహారం అందజేస్తామనడంతో ఊరట చెందిన రైతులకు నేటికీ బ్యాంకుల్లో డబ్బులు జమ కాలేదు. దీంతో రైతులు పంట పరిహారం ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు.

3200 ఎకరాల్లో పంటసాగు..

పంట కోతకు రావడంతో రైతులు వ్యవసాయ కూలీలతో కోతలను ముమ్మరం చేశారు. మండలంలోని 14గ్రామాల్లో పత్తిని తీసేసి 3200 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. అకాల వర్షాలకు 810 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లగా మిగతా పంటను ప్రస్తుతం కోతలు ప్రారంభించారు. ఇప్పుడు వచ్చే మొక్కజొన్నను మద్దతు ధరకు కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం త్వరలో జమవుతుంది



మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతులు ఆందోళన పడొద్దు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు త్వరలో పరిహారం జమవుతుంది.

– ప్రత్యూష, ఏవో, జూలపల్లి

పెరిగిన మొక్కజొన్న సాగు..

మండలంలో ఐదేళ్లుగా మొక్కజొన్న సాగు పెరుగుతోంది. 2019లో 1189 ఎకరాలు సాగు చేయగా, 2020లో 1813 ఎకరాలు, 2021లో 2331 ఎకరాలు, 2022లో 3369 ఎకరాలు, 2023లో 3200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అంచనాలు తెలియజేస్తున్నాయి. యాసంగిలో మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యాసంగిలో దాదాపు జిల్లాలో 6.50లక్షల ఎకరాల్లో సాగు చేయగా 17.37 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

మద్దతు ధరకు కొనాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు వరి కొనుగోలు చేస్తున్న విధంగానే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. మద్దతు ధర వస్తేనే రైతులు నష్టపోరు.

– ఐల రాజయ్య, రైతు, జూలపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షాలకు మొక్కజొన్న రైతులు చాలా నష్టపోయారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. అప్పుడే నష్టపోయిన రైతులకు కొంతవరకైనా మేలు జరుగుతుంది.

– సంగసాని దేవేందర్‌రెడ్డి, రైతు, కోనరావుపేట

క్లుప్తంగా

సీపీఆర్‌తో గుండెపోటును అధిగమించవచ్చు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మధుకర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేయడంతో కొంతమేరకు గుండెపోటును అధిగమించవచ్చని గర్రెపల్లి పీహెచ్‌సీ వైద్యులు మధుకర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండల ప్రజాపరిషత్ సమావేశంలో ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన శుక్రవారం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శశికళ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మండల స్థాయి పీర్ అధికారుల పర్యటన



ఎరువుల తయారీ పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లెలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 2023లో చేపట్టిన ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, కంపోస్టు ఎరువుల తయారీని పీర్ మండల స్థాయి అధికారుల బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నమోదు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏపీవో సదానందం, ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి శరత్, వెలుగు సమాఖ్య సీసీ, ఈజీఎస్ ఎఫ్ఏ ఉన్నారు.

ఉచిత నృత్య శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణను ప్రారంభిస్తున్న గోలివాడ చంద్రకళ

జ్యోతినగర్: వేసవి ఉచిత నృత్య శిక్షణ శిబిరాన్ని తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు గోలివాడ చంద్రకళ శుక్రవారం ప్రారంభించారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో చిన్నారులకు వేసవి సెలవుల్లో నృత్యం నేర్చుకునేందుకు వీలుగా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. శిక్షణ శిబిరం నెలరోజుల పాటు కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీలత, జ్యోత్స్న, శ్యామల, షాజిత, సుష్మ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్తయ్య

ఓదెల: మండలంలోని పొత్కపల్లి, నాంసానిపల్లె, కొలనూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో జి.సత్తయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పంటపొలాలకు వెళ్లే బండ్ల బాటలను గుర్తించి పనులు చేయాలని ఆదేశించారు. జాబ్‌కార్డులు లేని కూలీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు పనులను గుర్తించి కేటాయించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రెడ్డి నవీన్, సత్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారులకు బిక్ష



బిక్షలో విజయరమణారావు

సుల్తానాబాద్: పట్టణ కేంద్రంలోని శివాలయంలో హనుమాన్ మాలధారులకు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు బిక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

ఓదెల: మండలంలోని రూపునారాయణపేటలో కంటివెలుగు శిబిరాన్ని శానగొండ ఎంపీటీసీ జీల తిరుపతి శుక్రవారం ప్రారంభించారు. ఉపసర్పంచ్ రమేశ్, డాక్టర్లు, నాయకులు బొంగోని శ్రీనివాస్‌గౌడ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో వసతులు కల్పించండి



లైబ్రరీలో పాఠకులతో మాట్లాడుతున్న ఉష

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో కనీస వసతులు కల్పించకపోవడం దారుణమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. గ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించి పాఠకులు, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు గోపాల్, రియాజ్, శారద, రాజ్‌కుమార్, రజనీకాంత్, సాయి ఉన్నారు.

మోటార్ రంగ కార్మికులను ఆదుకోవాలి

జ్యోతినగర్(రామగుండం): మోటార్ రంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్ కోరారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని సంఘం కార్యాలయంలో రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ–అనుబంధం) అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైన్ లారీలపై డ్రైవర్లుగా, క్లీనర్లుగా పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలన్నారు. సలీం, మోష, ఫినాస్, రమణలు యూనియన్ ముందుకు సాగకుండా అడ్డుపడుతూ అనేక అవరోధాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వారిలో ఎలాంటి మార్పు రానందున వారం క్రితం సంఘం నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్ డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ, నాయకులు చిలుక శంకర్, బొట్టు రవికుమార్ పాల్గొన్నారు.

సీఎం కప్ విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ స్రవంతి

మంథని: మండల స్థాయిలో నిర్వహించే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని క్రీడల కమిటీ చైర్మన్ కొండ శంకర్ కోరారు. మంథని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కమిటీ సమావేశమైంది. శంకర్ మాట్లాడుతూ 15 నుంచి 17వ తేదీ వరకు మూడురోజులు స్థానిక సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 13లోగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. మంథని జెడ్పీటీసీ తగరం సుమలత, తహసీల్దార్ బండి ప్రకాష్, ఎంపీడీవో రమేశ్, కమిషనర్ శారద పాల్గొన్నారు.

కప్ నిర్వహణపై సమావేశం

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండల కేంద్రాల్లో సీఎం కప్ నిర్వహణలో భాగంగా మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించేందుకు శుక్రవారం మండలస్థాయి అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాదరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను గుర్తించేందుకే..

పెద్దపల్లిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బండారి స్రవంతి, జెడ్పీటీసీ రామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోటీలను ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, డిప్యూటీ ఎమ్మార్వో మల్లికార్జున్ ఉన్నారు.

15 నుంచి సీఎం కప్ పోటీలు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో 15 నుంచి 17వ తేదీ వరకు సీఎం కప్–2023 పేరుతో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు. పోటీల్లో 15 నుంచి 36 ఏళ్ల వయసు లోపు వారు పాల్గొనే అవకాశం ఉందన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో స్త్రీ, పురుషులకు అవకాశం కల్పించగా ఫుట్‌బాల్ పోటీలు మాత్రం కేవలం పురుషులకు మాత్రమే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాపోటీలు ఉదయం 6 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు కొనసాగుతాయన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: 15 నుంచి 17వరకు జరిగే మండల స్థాయి సీఎం కప్ క్రీడల నిర్వహణకు సంబంధించిన పనులపై ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సమావేశం జరిగింది. జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ మాట్లాడుతూ నైపుణ్యం ప్రదర్శించే క్రీడాకారులు జిల్లాస్థాయిలో 22, 23, 24తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపీడీవో వేణుగోపాలరావు, తహసీల్దార్ జయశ్రీ, ఎంపీవో కిరణ్, పీఈడీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు, త్యాగం మరువలేనివి



సిబ్బందికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే చందర్



సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్



ఎలిగేడు: సన్మానిస్తున్న సర్పంచ్ కావేరి

కోల్‌సిటీ: నర్సుల సేవలు, త్యాగం మరువలేనివని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన నర్సింగ్ డే వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో బాధితులను కాపాడేందుకు నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించారన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ఆర్‌ఎంవోలు, హెచ్‌వోడీలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నర్సింగ్ డే వేడుకలను ఆస్పత్రి ఆవరణలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నర్సింగ్ సిబ్బందికి సత్కారం..

రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం నర్సింగ్ డే సందర్భంగా ఆస్పత్రిలోని నర్సింగ్ సిబ్బంది సేవలను డీసీసీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అభినందించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్పొరేషన్ విభాగం అధ్యక్షుడు యుగందర్ ఆధ్వర్యంలో సిబ్బందిని సత్కరించారు.

కాల్వశ్రీరాంపూర్‌లో నర్సుల దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేందర్, శ్రీనివాస్, హెచ్‌ఈవో శ్రీనివాస్, వినీత్, హెడ్‌నర్సు విజయ, హెల్త్ సూపర్‌వైజర్ సరోజన, స్టాఫ్‌నర్సులు శ్వేత, విజయ, భారతి, సుజాత ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్: కేక్ కట్ చేస్తున్న నర్సులు

ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సన్మానం

ఎలిగేడు: ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ధూళికట్ట పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగును సందర్శించిన ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలను సర్పంచ్ గొల్లె కావేరి సన్మానించారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల నివాళి



నివాళి అర్పిస్తున్న కార్యదర్శులు

పెద్దపల్లిరూరల్: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రంగాపురం పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ఆఫీసులోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా.. పెద్దపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం కార్యదర్శులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సంఘం నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, మహేశ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎస్సైగా మహేందర్



మహేందర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎస్సైగా మహేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై పేర్కొన్నారు.

బసంత్‌నగర్ ఎస్సైగా వెంకటేశ్



వెంకటేశ్

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా సులువ వెంకటేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్ గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సైగా పనిచేశారు. కాగా కాళేశ్వరం జోన్ పరిధి ఎస్సైల బదిలీల్లో భాగంగా బసంత్‌నగర్‌కు వచ్చారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కమాన్‌పూర్: మండలంలోని మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి బాపూజీ నగర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం కల్వచర్లకు చెందిన బొంకూరి పోశం తీవ్రంగా గాయపడ్డాడు. పోశంను 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెద్దపల్లి నుంచి కల్వచర్లకు బైక్‌పై వస్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోయాడా లేక వాహనం ఢీకొన్నదా అనే విషయంలో నిర్ధారణ కోసం కమాన్‌పూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తున్నారు.

164మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో శుక్రవారం 164 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 19 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, మెడికల్ ఆఫీసర్ స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో హనుమాన్ శోభాయాత్ర

కమాన్‌పూర్: హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో హనుమాన్ మాలధారులు శుక్రవారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

మృతురాలి కుటుంబానికి మక్కాన్‌సింగ్ పరామర్శ



పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

పాలకుర్తి: మండలంలోని వేంనూర్‌లో ఇటీవల మృతిచెందిన జయ కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శుక్రవారం పరామర్శించారు. జయ 3రోజుల క్రితం గ్రామ శివారులో ఉపాధిహామీ పనులు చేస్తుండగా పాము కాటుకు గురై మృతిచెందింది. వారి ఇంటికి వెళ్లిన మక్కాన్‌సింగ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఉపాధిహామీ అధికారులతో మాట్లాడి జయ కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం అందజేయాలని కోరారు. బోరె లచ్చయ్య, రాములు, సుధాకర్, రాజేశ్, ప్రేమ్, ఓదెలు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

కమాన్‌పూర్: ఈ నెల 20 నుంచి మండల కేంద్రంలో నిర్వహించనున్న బొడ్రాయి, పోచమ్మ కొలుపు ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు.

సీఎంకు పోస్టుకార్డులు



మంథని: ఐకేపీ వీవోఏలు సమ్మెలో భాగంగా శుక్రవారం సీఎం కేసీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు పోస్టుకార్డులు పంపారు. తమ సమస్యలు పరిష్కరించాలని 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ అన్నారు. సంఘాల నాయకులు ఆర్ల సందీప్, ఏల్పుల సురేష్, గొర్రంకల సురేష్, మంథని లింగయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై తాత్సారం ఎందుకు?

రామగుండం: గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సొసైటీ అధికారులు కొనుగోళ్లపై తాత్సారం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని కాంగ్రెస్ పార్టీ అంతర్గాం మండల ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ పిలుపు మేరకు అంతర్గాం పరిధిలోని గోలివాడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కాంగ్రెస్ నాయకులు కట్కూరి వెంకటరెడ్డి, బొడ్డు లింగమూర్తి, ఆవుల గోపాల్‌యాదవ్, జిమ్ముల రామారావు, గజ్జెల నాగరాజు, పానుగంటి సత్యనారాయణ, కాంపెల్లి కిరణ్, సంతోష్, స్వామి, అనిల్, రాహుల్ ఉన్నారు.

సమాచారం

✦ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: పట్టణంలో సబ్‌స్టేషన్ మరమ్మతు పనులతో పాటు 33కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లలో ఉన్న చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రామగుండం ట్రాన్స్‌కో ఏఈ బేతి దామోదర్‌రావు తెలిపారు. మల్యాలపల్లి, బద్రిపల్లి, మొగల్‌పహాడ్, కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వేస్టేషన్ ఏరియా, జీరోపాయింట్, హౌజింగ్‌బోర్డు, లింగాపూర్, అబాది రామగుండం, సండే మార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మంథని మండలంలో..

మంథని: విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతు పనుల దృష్ట్యా మంథని, గుంజపడుగు, నాగారంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈఈ మల్లయ్య తెలిపారు.

అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో..

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ శ్రీనివాస్, ఏఈ హరీశ్ శుక్రవారం తెలిపారు. మరమ్మతు పనుల్లో భాగంగా అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 15, 16, 17, 18, 19వ డివిజన్ ఏరియాల్లో సంతోష్‌నగర్, కేకే నగర్, షాపింగ్ కాంప్లెక్స్, షిర్కె బస్టాప్, అంబాడి తండా, రాజీవ్‌నగర్, హనుమాన్‌నగర్ అల్లూరు కాలనీ, న్యూమారేడుపాక ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలలోని సంకట విమోచన రామభక్త వీర హనుమాన్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా హోమం నిర్వహించి అనంతరం కల్యాణం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

✦ ఆర్థికసాయం

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన కోట శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. కాగా నిరుపేద కుటుంబమైన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ సూచనల మేరకు శుక్రవారం కేసీఆర్ సేవాదళం జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బొద్దుల సాయినాథ్ మృతుని కుటుంబానికి రూ.3వేలు అందజేశారు. కోట సురేందర్ ఉన్నారు.

✦ చికెన్ సెంటర్‌ను తొలగించాలి

సుల్తానాబాద్: పూసాల రోడ్డు నుంచి చికెన్ సెంటర్‌ను తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకుడు పురం రమణ అధికారులను కోరారు. అధికారులు గురువారం చికెన్ సెంటర్‌ను పరిశీలించి దుర్వాసనను చూసి సీజ్ చేశారని వెంటనే శుక్రవారం తిరిగి ఎలా ఓపెన్ చేసి నడిపిస్తారని ప్రశ్నించారు.

✦ యువతి వివాహానికి సాయం

ఎలిగేడు: మండల కేంద్రానికి చెందిన కోమండ్ల కల్యాణి–సత్యనారాయణ దంపతుల కూతురు సంజన వివాహానికి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ పంపించిన రూ.5వేలు, చీర శుక్రవారం కేసీఆర్ సేవాదళం మండల అధ్యక్షుడు బింగి రాజు అందజేశారు.

✦ మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఓదెల: మండలంలోని కొమిరలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ నాయకుడు తొట్ల రాయకొంరయ్య కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఓదెలలో పక్షవాతంతో బాధపడుతున్న గోశెట్టి సురేశ్ కుటుంబానికి ఆయన రూ.5వేలు అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు శనిగరపు రమేశ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.